క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రికి ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లను వైద్యాధికారి మహేంద్రనాథ్‌కు అందిస్తున్న బాలం రాజశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తాడిమర్రికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బాలం రాజశేఖర్‌రెడ్డి, బాలం లక్ష్మీనారాయణరెడ్డిలు నాలుగు స్టాండ్ ఫ్యాన్లను వితరణ చేశారు. ఫ్యాన్లను సోమవారం వారు వైద్యాధికారి మహేంద్రనాథ్‌కు అందించారు. ఈ సందర్భంగా బాలం రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి దివంగత కరణం బాలం కొండారెడ్డి జ్ఞాపకార్థం ఆసుపత్రి సిబ్బంది సౌకర్యార్థం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ సికిందర్, ఎంపీహెచ్ఈఓ నారాయణస్వామి, ఆరోగ్య కార్యకర్త జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులతో మండల అభివృద్ధి, సమస్యలపై సమీక్ష చేయనున్నట్లు ఆమె తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తహసీల్దార్, వ్యవసాయ అధికారి, పీఆర్ ఇంజినీర్ తదితర మండల స్థాయి అధికారులు వారి శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తదితర పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అంజినప్ప

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి పంచాయతీ జురుకువారిపల్లి సమీపంలోని బురుగపల్లిగుట్ట వద్ద ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన ఖండిత కందకాల పనులను సోమవారం ఎంపీడీఓ అంజినప్ప పరిశీలించారు. కూలీలతో మాట్లాడుతూ ప్రతి కూలీ గరిష్టంగా వేతనం వచ్చేలా పనులు చేసుకోవాలన్నారు. ప్రతి కుటుంబం వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నేల స్వభావం పనులకు అనువుగా ఉంటుందని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పండ్ల తోటల పెంపకం కోసం ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని క్షేత్ర, సాంకేతిక సహాయకులను ఆదేశించారు.


శ్మశాన వాటికలో చదును



పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి

తనకల్లు: మండల పరిధిలోని కోటపల్లిలో దళితవాడ శ్మశాన వాటికలో భూమి చదును పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు వాల్మీకీ పవన్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ మునేనాయక్ మాట్లాడుతూ గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సమస్యను తహసీల్దార్ మధునాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో 232(2) సర్వే నంబర్లో రెండెకరాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వాల్మీకీ విద్యా సంస్థల చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి సహకారంతో భూ చదును పనులకు భూమిపూజ చేశామన్నారు. రిటైర్డ్ హెచ్ఎం ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, నరసింహులు, దళిత సంఘాల నాయకులు తోపు పారేసు, ఎమ్మార్పీస్ మండల కన్వీనర్ గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న వెంకటకృష్ణారెడ్డి

తాడిమర్రి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మద్దులచెర్వు గ్రామంలో సోమవారం ఆయన ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డితో కలసి గుడ్మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గడ్డె పురుషోత్తంరెడ్డి, గడ్డె సుబ్బిరెడ్డి, గడ్డె కృష్ణారెడ్డి, బొమ్మక ఆదినారాయణరెడ్డి, ఉప్పలూరి కేశవరెడ్డి తదితరులున్నారు.

ప్రజలతో మమేకమై విధులు

- కదిరి నూతన డీఎస్పీ శ్రీలత



బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ శ్రీలత

కదిరి: కదిరి నూతన డీఎస్పీగా ఎం.శ్రీలత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆమె ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం డీఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'నేను రాయలసీమలోనే పుట్టా. మాది అన్నమయ్య జిల్లా కోడూరు. ఈ ప్రాంత సమస్యలు నాకు కొత్త కాదు. ప్రజలతో మమేకమై విధులను నిర్వర్తిస్తా' అని తెలిపారు. కదిరి సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడైనా శాంతి భద్రతలు విఘాతం కల్గినా..లేదంటే ఎవరైనా ఇబ్బందులకు గురైనా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని, అక్కడ కూడా తమ సమస్యలు పరిష్కారం కాలేదని భావిస్తే అప్పుడు తనను నేరుగా కలిసి తమ బాధలు చెప్పుకోవచ్చని డీఎస్పీ తెలిపారు. కదిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉందని తెలుసుకున్నానని, ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ప్రజల కోసం పని చేసే వారికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని.. అలాగే అసాంఘిక శక్తుల ఆట కట్టించడంలో అంతే కఠినంగా ఉంటానని హెచ్చరించారు. ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సబ్ డివిజన్ వ్యాప్తంగా పర్యటించి శాంతిభద్రతలకు విఘాతం కల్గించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తానని తెలియజేశారు. అంతకు మునుపు సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది డీఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానం పలికారు.

కొత్త డీఎస్పీకి సమస్యల సవాల్

కదిరి: డీఎస్పీ భవ్యకిషోర్ తిరుపతి జిల్లా రేణిగుంటకు బదిలీ కావడంతో కదిరి డీఎస్పీగా మురుముట్ల శ్రీలత సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజమండ్రి సౌత్ డీఎస్పీగా ఉంటూ బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఈ క్రమంలో కొత్త డీఎస్పీ తక్షణం దృష్టి సారించాల్సిన ప్రధాన సమస్యలు కొన్ని....

- కదిరి పట్టణంలోని ఎంజీ రోడ్‌లో బంగారు నగలు తయారు చేసే మహారాష్ట్రకు చెందిన యువకుడు కిరణ్(23)తాను ఉంటున్న గదిలోనే 2021 సెప్టెంబర్ 12న దారుణ హత్యకు గురయ్యారు. ఆ కేసును పోలీసులు ఇంత వరకూ ఛేదించలేదు.
- కదిరి పట్టణంలోని కాలేజ్ రోడ్‌లో కిరాణా దుకాణం నిర్వహించే ప్రమీళ (24) అనే మహిళను 2022 మార్చి 21న గుర్తుతెలియని వ్యక్తులు అతి కిరాతకంగా హత్య చేసి శవాన్ని కిరాణా కొట్టులోనే సరుకుల బస్తాల మధ్య పడేసి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ కేసును కూడా పట్టణ పోలీసులు ఇంత వరకూ ఛేదించలేదు.
- పట్టణంలోని యువత గంజాయికి అలవాటు పడి పెడత్రోవ పడుతున్నారు. హైస్కూల్ విద్యార్థులు సైతం గంజాయి మత్తులో పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- అక్రమ లాటరీ టికెట్లు, నిషేధిత గుట్కా అమ్మకాలు కదిరి పట్టణంలో జోరుగా సాగుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాల్సి ఉంది. మట్కా సైతం గుట్టుగా సాగుతోంది. దీని వెనుక కొందరి పోలీసుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోంది.
- ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యక్తిగతంగా పోస్టులు పెట్టడంతో అవి గొడవలకు దారి తీస్తున్నాయి. వీరిని కట్టడి చేయక పోతే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంది.
- కదిరి పట్టణంతో పాటు పలు మండల కేంద్రాల్లోనే కాకుండా కొన్ని శివారు ప్రాంతాల్లో కొందరు పెద్ద మొత్తంలో పేకాట ఆడిస్తున్నారు. కొందరు పోలీసులే స్వయంగా కమీషన్లు తీసుకొని పేకాట ఆడిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- కదిరిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే గడపగడపకూ..



సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కాళసముద్రం సచివాలయం పరిధిలో చిప్పలమడుగు, నడింపల్లి గ్రామాల్లో ఆయన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటికీ వస్తున్నామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంతో 1.40 కోట్ల గృహాలను 7 లక్షలకు పైగా జగనన్న సైనికులు సందర్శించి ప్రజల అభిప్రాయాలను సేకరించారన్నారు. ముఖ్యమంత్రి ఏ కార్యక్రమం తలపెట్టినా అది ప్రజా సంక్షేమం కోసమేనని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలు:

తమ గ్రామానికి 104 వాహనం అందుబాటులోకి రాలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే జిల్లా వైద్యాధికారితో మాట్లాడి వాహనం నడింపల్లికి వచ్చేవిధంగా చేశారు. మద్దిలేరు వాగుపై బ్రిడ్జి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, త్వరలో ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు కావాలని కోరగా విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. సిమెంటు రోడ్లకు ఎస్టిమేట్లు తయారు చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అనంతరం కాళసముద్రంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయ్, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, నాయకులు ప్రణీత్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, రాజారెడ్డి, ఈశ్వరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాబ్జాన్, శ్రీనివాసులు, గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంద్‌నాయక్, సర్పంచ్ చలపతినాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి

రాప్తాడురూరల్: వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షల లబ్ధి చేకూరిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ సచివాలయం–3 పరిధిలో ×గడప గడపకూ మన ప్రభుత్వం× కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రతి గడపలోనూ ఎమ్మెల్యేను మహిళలు ఆప్యాయంగా పలకరించారు. ఇళ్ల వద్దకు వెళ్లగానే మూడేళ్లలో ఆ కుటుంబం ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తాటిచెర్ల నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ తేజశ్విని, ఎంపీటీసీ సభ్యులు గాయత్రిదేవి, వడ్డే శీనా, నాయకులు ధనుంజయ యాదవ్, యూత్ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ బండిపవన్, జేసీఎస్ మండల కన్వీనర్ శ్యాంసుందర్, స్థానిక నాయకులు వలి, రామస్వామి, రెడ్డప్ప, బాషా, అన్ను, జాఫర్, సలీం తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

మాధవరాజులు స్వామికి పూజలు

కనగానపల్లి: బద్దలాపురం మాధవరాజులు స్వామి పరుషలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరాజులు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. దీంతో పాటు స్థానిక వాల్మీకి, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతీప్రసాద్, పార్టీ కన్వీనర్ అమరనాథరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి డెంటల్ కేర్ ప్రారంభం



పుట్టపర్తి డెంటర్ కేర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి పట్టణంలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్.కేశవరెడ్డి కుమారుడు డాక్టర్ డీఎస్ నందన్ రెడ్డి ఏర్పాటు చేసిన పుట్టపర్తి డెంటల్ కేర్ వైద్యశాలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన దంత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం గొప్పవిషయమన్నారు. నందన్ రెడ్డి మాట్లాడుతూ ఇంప్లాటేషన్, టీత్ క్లీనింగ్‌తోపాటు అన్ని రకాల సేవలను నిష్ణాతులైన సిబ్బందితో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 4న నిర్వహించనున్నట్లు ఎంపీపీ మజ్జిగ అంజలి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

పనితీరు మెరుగుపడాలి

ఎన్పీకుంట: పీహెచ్‌సీ పరిధిలో విధులు నిర్వహించే ఏఎన్ఎంల పనితీరు మెరుగు పరుచుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, ఎన్‌సీడీ, సీడీ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ నివేదిత సూచించారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, ఓపీ వివరాలను పరిశీలించారు. ఎన్‌సీడీ, సీడీ సర్వే కార్యక్రమంలో ఏఎన్ఎంల పనితీరు సరిగాలేదని అసహనం వ్యక్తం చేశారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ఎపిడమాలజిస్ట్ డాక్టర్ బాలాజినాయక్, వైద్యాధికారిణి డాక్టర్ ఆసియా, ఆరోగ్యకార్యకర్త రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ధర్మవరం అర్బన్: కేతిరెడ్డి కాలనీలో విద్యుదాఘాతంతో సోమవారం ఓ రైతు ఎద్దు మృతి చెందింది. రైతు శ్రీనివాసరెడ్డి తన ఎద్దును తోలుకుంటూ వెళుతుండగా కిందకు తెగిపడిన విద్యుత్ వైరును గమనించక తొక్కింది. దీంతో ఎద్దుకు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. వైరు తెగి కిందపడి వారంరోజులు అయిందని, విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సోమవారం ద్విచక్రవాహనం ఢీకొని గొట్లూరు గ్రామానికి చెందిన నారాయణస్వామి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

5 నుంచి ఉచిత శిక్షణ

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5 నుంచి 31వ తేదీవరకు టేబుల్ టెన్నిస్ ఉచిత శిక్షణ కార్యక్రమం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. 8 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు కళాశాలలో పీడీ నరసింహాచారిని సంప్రదించాలని ఆయన కోరారు.

అధైర్యం వద్దు.. అండగా ఉంటా

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి భరోసా

కొత్తచెరువు: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, అధైర్య పడరాదని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తచెరువు గ్రామంలో పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. కొత్తచెరువు మాజీ ఎంపీపీ వడ్డె నాగమణి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరలోనే కోలుకుంటారని ధైర్యం చెప్పారు. అలాగే, ఇటీవల హిందూపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దాదాపీర్ ఇంటికి వెళ్లి ఆయన తల్లిదండ్రులను ఎమ్మెల్యే పరామర్శించారు.

- గుండెపోటుతో మృతి చెందిన ప్రవీణ్‌కుమార్, టీవీ మెకానిక్ దాదాపీర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బుక్కపట్నం రహదారిలో తిక్కమ్మ గుడి వద్ద మూడు రోజులు క్రితం అగ్నిప్రమాదంలో పశుగ్రాసం బుగ్గిపాలై నష్టపోయిన కెంపుల లక్ష్మిని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి ఆయువు పట్టు అని, ఏ కష్టం వచ్చినా తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, ఎంపీపీ భర్త రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ భర్త మటన్ శంకర్, దాల్‌మిల్‌సూరి, సర్పంచ్ భర్త నాగరాజు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సోమశేఖర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ భాస్కర్, ఉపసర్పంచ్ యుగంధర్, పెయింటర్ కేశవ, సుబ్బారావు, యల్లప్ప, షాన్‌షేట్, ఆవుల అశోక్, మారుతి, వెంకటరాముడు, సాయి, అయ్యుబ్, గొడ్డాల్ జాకీర్, వడ్డె ఫణి, విజయ్, బళ్లారి బాబు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న పలు కుటుంబాలను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో తిప్పారెడ్డి, రామమోహన్‌రెడ్డి, క్రిష్టారెడ్డి కుటుంబాలు ఉన్నాయి. ఎమ్మెల్యే వెంట జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ రమణారెడ్డి, మండల అడ్వయిజరీ బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు గంగాద్రి, మల్లిరెడ్డి, చింతారమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వనం రామమోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మాజీ ఎంపీపీ నాగమణిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

- జగరాజుపల్లి బస్టాండులో ఎమ్మెల్యే ఇంటి గృహప్రవేశానికి హాజరయ్యారు. రామమోహన్‌రెడ్డి నిర్మించిన ఇంటిలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర రెడ్డి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జనార్దనరెడ్డి, కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన నూతన డీఎస్పీ

పుట్టపర్తి: పుట్టపర్తి నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వాసుదేవన్ సోమవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. ప్రశాంతతకు మారుపేరైన పుట్టపర్తి మరింత ప్రశాంతంగా ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి డీఎస్పీకి సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పీఆర్‌టీవీధిలో ఉన్న షాదీమహల్‌లో సోమవారం 130 పేద ముస్లిం కుటుంబాల పిల్లలకు ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేద ముస్లింల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో దువా చేశారు.

ఆరోగ్య సేవలు సక్రమంగా అందాలి

కనగానపల్లి: గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను సక్రమంగా అందించాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక పీహెచ్‌సీలో మండలంలో జరుగుతున్న ఆరోగ్య సేవలపై వైద్య సిబ్బందితో కలసి ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి, సీహెచ్ఓ గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తేరు ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఈనెల 3న లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి భారీ ఎత్తున భక్తులు, ప్రజలు రానుండటంతో బందోబస్తు ఏర్పాట్లను వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సోమవారం పరిశీలించారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం

తాడిమర్రి: స్థానిక సత్యసాయి తాగునీటి సంపువద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అరుణ పతాకాన్ని సత్యసాయి తీగునీటి సరఫరా కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, తిరుపాలు, చిన్నఓబిలేసు, మహేశ్వర్‌రెడ్డి, నడిపి ఓబిలేసు తదితరులు మాట్లాడుతూ అలుపెరుగని పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సత్యసాయి తాగునీటి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చడంలో యాజమాన్యం మీనమేశాలు లెక్కిస్తోందని వారు ఎద్దేవా చేశారు. ఇకనైనా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు ప్రసాద్,రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు

కదిరిలో..

కదిరి టౌన్: మేడేని పురస్కరించుకొని కదిరిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ కార్మికులు, హమాలీలు, వ్యవసాయ కార్మికులు నాలుగు చోట్ల ఎర్ర జెండా సోమవారం ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ 18వ శతాబ్దంలో పని గంటల కోసం పోరాడి ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జరుపుకునేది మేడే అన్నారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, బాబాజాన్, కృష్ణనాయక్, నారాయణ, అంగన్వాడి యూనియన్ నాయకులు మాబున్నీషా,స రోజ, మాధవి, సుమలత, హమాలి యూనియన్ నాయకులు తిరుపాల్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లులో..

తనకల్లు: మండల కేంద్రంలో సోమవారం మే డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సీపీఐ, సీపీఎం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను పట్టించుకోవడం లేదన్నారు. కర్షక, కార్మిక, శ్రామికులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వామపక్షాల పార్టీ నాయకులు కదిరెప్ప, రెడ్డెప్ప, శివన్న, భాగ్యమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల ఐక్యత వర్ధిల్లాలి

ఓడీ చెరువు: మండల కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మేడే ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ నాయకులు బీసీ కాలనీలో, చౌకధాన్యపు గిడ్డంగి వద్ద సీపీఎం, ఆటో స్టాండ్ వద్ద ఆర్‌సీపీ నాయకులు కార్మిక జెండాను ఎగుర వేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజి, రమణ, శ్రీరాములు, మున్నా, చలపతి, రత్నాబాయి, కిష్టప్ప, కుళ్లాయప్ప రాజమ్మ, వెంకటేష్, జనార్ధన, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

రెపరెపలాడిన అరుణ పతాకం

పుట్టపర్తి టౌన్: మే డే సందర్భంగా పుట్టపర్తి పట్టణంలో అరుణ పతాకం రెపరెపలాడింది. సీపీఐ, సీఐటీయూ , కేవీపీయస్, రైతు సంఘం తదితర సంఘాల నేతలు జెండా వందనం చేశారు. కేక్ కట్ చేసి పంచి పెట్టి సంబరాలు చేసుకొన్నారు. సీపీఎం, సీపీఐ నాయకులు రామకృష్ణ, పైపల్లి గంగాద్రి, సీఐటీయూ నాయకులు గౌస్‌లాజం, బాబావలి తదితరులు పాల్గొన్నారు.



తాడిమర్రిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా కార్మిక దినోత్సవం

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఎంపీపీ మజ్జిగ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, ఎంపీడీఓ అశోక్ నాయకులు సోమవారం మేడే వేడుకలు నిర్వహించారు. ఏపీఓ అశోక్, సర్పంచ్ ధనలక్ష్మి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, ఎంపీటీసీలు పవన్‌కుమార్ రెడ్డి, నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి, ఉపాధి సిబ్బంది లింగమయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: మండలంలో మే డే వేడుకలను కార్మిక సంఘాలు, వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కదిరప్ప ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పారిశుధ్య, సీడబ్ల్యూఎస్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఆటో సర్కిల్లో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు మహదేవ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, నాయకులు గోవిందు, నాగరాజు, మహానంద, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు. సీఎస్ కోట గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో మే డే వేడుకలు జరుపుకున్నారు.



చెన్నేకొత్తపల్లిలో కూలీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ధర్మవరం/ధర్మవరం అర్బన్: పట్టణంలో కార్మికుల దినోత్సవం సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద జెండా ఆవిష్కరించారు. అలాగే, ధర్మవరం ఆర్టీసీ డిపోలో మేడే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పోలా రామంజినేయులు, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్‌లో..

తలుపుల: మేడే సందర్భంగా సోమవారం సీపీఐ, ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్లు స్థానిక ఆటో స్టాండ్‌లో జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. కార్మికుల, బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి సీపీఐ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, హసాన్, సిద్దయ్య, ఎద్దులరాముడు తదితరులు పాల్గొన్నారు.